

# మిస్డ్

**భా**నుమూర్తికి ఆ సంవత్సరాంతపు ఇంక్రిమెంట్ వచ్చి బేసిక్ ఇంకో ఇరవై అయిదు రూపాయలు పెరిగినపుడు యింతకు ముందు కన్నా సంతోషించాడు.

ఈ పెరుగుదలతో అతడికి రైల్లో ఫస్ట్‌క్లాస్‌లో వెళ్ళే అర్హత లభిస్తుంది.

ఇంక్రిమెంట్ ఆర్డర్ చేతికి రాగానే అతడు చేసిన పని - ఫైల్సన్నీ వెతికి, బైట ఊరు వెళ్ళాల్సిన పనిని వెతికి పట్టుకోవటం. అదృష్టవశాత్తూ కలకత్తాలో అటువంటి పని వున్నట్టు

ఖస్ట్
కనబడింది. వెంటనే ఆఫీసర్‌కి నోట్ పెట్టాడు.

ఏ మూడ్‌లో వున్నాడోగానీ ఆఫీసర్ "ఎస్" అన్నాడు. ఆ రోజు సాయంత్రమే అతడు స్టేషన్‌కి వెళ్ళేడు.

ఠీవిగా "సమశీతోష్ణ మరియు మొదటి తరగతి రిజర్వేషన్‌లు" అని వ్రాసి వున్న విండో దగ్గిరకు నడిచేడు.

అతడు అంతకు ముందు చాలాసార్లు పొడవాటి క్యూల్లో నిలబడి మూడో తరగతి టిక్కెట్లు కొన్నాడు. అలా నిలబడి వున్నప్పుడు అతడి దృష్టి మొదటి తరగతి కౌంటర్ మీద పడేది. చకచకా నడుచుకుంటూ వచ్చి, టిక్కెట్ కొనుక్కుని అదే స్పీడ్‌లో వెళ్ళి పోయే హుషారైన బెల్‌బాటమ్ అమ్మాయిలను కళ్ళప్పగించి చూసేవాడు.

కానీ ఇప్పటి పరిస్థితి వేరు.

తను టికెట్ తీసుకోవాల్సిన కిటికీ దగ్గిరకు నడుస్తూ - క్రింది తరగతి బుకింగు దగ్గిర వరుసలో నిలబడ్డ జనంవైపు జాలిగా చూసేడు.

తనున్న 'క్యూ'లో కూడా కొంతమంది తనలాగానూ, కొంతమంది తనకన్నా హీనంగానూ వున్నట్లు గమనించి కొద్దిగా ఆశ్చర్యపోయేడు.

ఫస్టు క్లాసులో ప్రయాణం చేసే బిజినెస్ మాగ్నెట్లు తమ గుమస్తాలనీ, ఆఫీసర్లు తమ నౌకర్లనీ పంపి టిక్కెట్లు తెప్పించుకుంటారనే జ్ఞాపకం వచ్చింది.

పది నిముషాలు నిలబడి బుకింగ్ దగ్గిరకి చేరుకొన్నాడు.

రిజర్వేషన్ కాగితమూ, రెండు వంద రూపాయల నోట్లు లోపలికి పెట్టాడు.

రాక్‌లోంచి టిక్కెట్టు అందుకోబోతూ, స్లిప్‌లో వున్న తారీఖు చూసి, కౌంటర్‌లో క్లర్కు ముఖం చిట్లించేచు కాగితాన్ని యివతలికి పడేస్తూ, "బైట బోర్డులో వ్రాసి వుంది కదండీ - బర్తులు ఏవీ ఖాళీ లేవని. ఊరికే మా టైమ్ వేస్టు చేస్తారెందుకు?" అన్నాడు విసుక్కొంటున్నట్లు.

భానుమూర్తికి క్షణం పాటూ గుండె ఆగిపోయింది. తనకి జరిగిన అవమానంకన్నా - తను ఫస్టు క్లాసులో ప్రయాణం చేయబోవటంలేదనే నిజం అతడిని ఎక్కువ బాధ పెట్టింది. ప్రోగ్రాం ఫిక్స్ అయిపోయింది. కాబట్టి వెళ్ళక తప్పదన్న బాధ. ఆ బాధలోనే అతడు వెయిటింగ్ లిస్టు విషయం కూడా మరిచి నిరాశగా వెనుదిరిగేడు.

* * *

కలకత్తాలో తమ బ్రాంచికి వెళ్ళగానే అతడు అడిగిన మొదటి ప్రశ్న "నా ఫస్టు క్లాసు టికెట్ బుక్ అయిందా?" అని.

అయిందని వాళ్ళు చెప్పగానే తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

ఆ ఊళ్ళో అతని పని, అనుకున్న టైమ్‌కే పూర్తయింది.

ఆ రోజు సాయంత్రమే అతని ప్రయాణం.

వెళ్ళబోయే ముందు బ్రాంచి మేనేజర్‌ని కలుసుకోవటానికి ఆయన ఛాంబర్‌లోకి వెళ్ళేడు.

ఎయిర్ కండిషన్డ్ రూములో మెత్తటి తివాసీ మీద నడుస్తూ వుంటే హుందా దానంతటదే వస్తుంది. ఠీవిగా వెళ్ళి యెదుటి కుర్చీలో కూర్చొన్నాడు. నిజానికి బ్రాంచి మేనేజర్ కేడర్ చాలా పెద్దది. అయినా హెడ్ ఆఫీసు నుంచి వచ్చిన వాళ్ళని బ్రాంచి వాళ్ళు గౌరవంగా చూస్తారు.

కొద్దిసేపు హెడ్ ఆఫీసు విషయాలు మాట్లాడి, "ఎప్పుడు వెళుతున్నారు మీరు?" అని అడిగేడు మేనేజర్.

"ఈ సాయంత్రమే - కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో" జవాబిచ్చాడు భానుమూర్తి.

"రెండే హాల్టులు కదా. భువనేశ్వర్, వాల్తేర్. చాలా కంఫర్టబుల్ జర్నీ" అన్నాడు మేనేజర్.

"ఎన్ని హాల్టు లయితే నేం. ఫస్టు క్లాసే కదా?" క్యాజువల్‌గా అన్నట్టు అన్నాడు భానుమూర్తి.

"రెండో నాలుగో యిస్తే బెడ్‌రోల్స్ ఇస్తారు తీసుకోండి-"

తలూపేడు భానుమూర్తి. నిజానికి అతనికి బెడ్‌రోల్స్ అంటే ఏమిటో తెలీదు. కానీ ఒక అంతస్థు నుంచి పై అంతస్థుకి పెరిగేటప్పుడు, ఇలాటి చిన్న చిన్న ఆత్మవంచనలు తప్పవు.

అయితే పై అంతస్థులోని వ్యక్తుల్లో మెలగవలసి వచ్చేటప్పుడు తనకీ ఆ స్థాయి కొత్తది కాదని నిరూపించుకోవటం కోసం ప్రవర్తించే ప్రవర్తన ఒకసారి చాలా ఇరకాటంలో పెడుతూ వుంటుంది.

భానుమూర్తికి ఆ రోజు అలాగే పరిస్థితి ఏర్పడింది.

ఆ రోజు డిన్నర్‌కి ఆహ్వానించేడు మేనేజర్. "ఆరింటికి ట్రైన్ కదా - కొద్దిగా తింటే వాల్తేర్‌లో బ్రేక్ ఫాస్టు తీసుకోవచ్చు."

భానుమూర్తి కొద్దిగా మొహమాటపడ్డా వెంటనే ఒప్పుకున్నాడు.

మేనేజర్ కారులో "బ్లూఫాక్స్" రెస్టారెంట్‌కి తీసుకెళ్ళాడు.

భానుమూర్తి మనసు అదోలా వుంది. అది పూర్తిగా ఆనందమూ కాదు . . . గర్వమూ కాదు. ఏదో పెరిగిపోయిన పరిస్థితి. అప్పర్ సర్కిల్స్‌లో మొదటిసారి మెలుగుతున్న ఫీలింగ్ అతనిలో తెలియని ఉద్వేగాన్ని కలిగిస్తోంది. అదేమీ కొత్తకాదు అన్నట్టు వుండటానికి మొఖాన్ని సీరియస్‌గా పెట్టి మేనేజర్‌తో పాటు వెళ్ళి కూర్చొన్నాడు.

టేబిల్ మీద ఉన్న "మెనూ" తీసుకొని చూస్తూ "ఏం తీసుకుంటారు?" అని అడిగేడు మేనేజర్.

భానుమూర్తి మాట్లాడలేదు. నిజానికి అక్కడ ఏం దొరుకుతాయో అతడికి తెలీదు. ఇంతలో మేనేజర్ అతడికి మెనూకార్డు అందిస్తూ, "మీకేం కావాలో చెప్పండి" అన్నాడు.

భానుమూర్తి కార్డు చూసేడు.

మిక్స్ నూడుల్స్, సాఫ్ట్ నూడుల్స్, చికిన్ టిక్కా వగైరా. కార్డు ఇచ్చేస్తూ, "ఇక్కడే బావుంటాయో మీరే ఆర్డర్ ఇవ్వండి" అన్నాడు.

ఖర్చ్

ఇంతలో బేరర్ వచ్చేడు.

మేనేజర్ చక చకా తనకి కావల్సినవి ఆర్డర్ ఇచ్చి భానుమూర్తి వైపు తిరిగేడు. ఇక ఇతడికి తప్పలేదు. మెనూ మళ్ళీ చేతిలోకి తీసుకొన్నాడు. అతడికి తెలిసింది అందులో 'చికెన్' అన్న పదం ఒక్కటే.

"చికెన్ టిక్కా" అన్నాడు - కార్డు పడేస్తూ.

"అంతేనా?" అడిగాడు మేనేజర్.

ఇంకేమనాలో తెలీక "అంతే" అన్నాడు.

"ఇంకేమన్నా తీసుకోండీ?"

భానుమూర్తి ఇంతవరకూ వచ్చేక వెనక్కి వెళ్ళదల్చుకోలేదు.

"ఇంకేమొద్దు. ట్రైన్ జర్నీలో ఎక్కువ తినను" అన్నాడు తన మాటమీద నిలబడుతూ.

ఇంతలో బేరర్ ట్రేలో పదార్థాలు తెచ్చేడు.

భానుమూర్తి ముందు పెట్టిన ప్లేట్లో మూడు నాలుగు చిన్న పకోడీల్లాంటివి పుల్లలు గుచ్చి వున్నాయి.

దాంతోనే ఆ రోజు రాత్రికి అతడు సరిపెట్టుకోవలసి వచ్చింది.

కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో నైట్ డిన్నర్ సర్వ్ చేస్తారని అతనికి తెలీదు.

*　　　　*　　　　*

అయిదూ నలభై అయిదుకల్లా భానుమూర్తి స్టేషన్ చేరుకున్నాడు.

అతడికి మనసంతా టెన్షన్‌గా వుంది. అతడెప్పుడూ ఫస్టుక్లాసులో ఎక్కలేదు. అసలు లోపల ఎలా వుంటుందో చూడలేదు కూడా.

చంద్రమండలం మీద దిగబోతున్నప్పుడు ఆర్మ్‌స్ట్రాంగ్ మనసులో ఉద్వేగంలాంటి టెన్షన్ అతడిలోనూ పేరుకుపోయింది.

వరసగా ఒకో కంపార్టుమెంట్ ముందున్న లిస్టులో తన పేరుంది.

కానీ ఏ సీటు . . . . ?

చాలాసేపు అక్కడే నిలబడి లిస్టుని పూర్తిగా అందరి పేర్లతో సహా చదివేడు.

టిక్కెట్ తీసి నెంబరు పరీక్షించి సంతృప్తిపడ్డాడు.

కానీ సీటు తెలియటం లేదు.

అంతలో అతని పక్కగా ఎవరో "ఎ - టూ" అనుకొంటూ లోపలికి వెళ్ళిపోయేడు. దాంతో అతడికీ అర్థమై తన పేరుముందు చూసుకున్నాడు. అతనిది "సి - త్రీ"

సూట్‌కేస్ పట్టుకొని లోపలికి నడిచేడు. చిన్న కారిడారూ, .వరుసగా క్యాబిన్సూ ఉన్నాయి. అందులో ఏది "సి" క్యాబినో తెలీటం లేదు.

"సి" అంటే మూడోది అయివుండాలి. కానీ అట్నుంచా - ఇట్నుంచా?"

అతడి విషయ పరిస్థితిని ఇంకా ఎక్కువ సేపు ఉంచడం ఇష్టం లేనట్లు దేముడు

అంతకు ముందు "ఎ - టూ" అన్న వ్యక్తిని పంపించేడు.

అతడు వెళ్ళి మొదట క్యాబిన్‌లో కూర్చున్నాడు.

అట్నుంచి మూడో క్యాబిన్‌లోకి వెళ్ళబోతూండగా తలమీద పెద్ద అక్షరం "సి" కనబడింది.

అప్పటి వరకూ పైకి చూడాలనే ఆలోచన రానందుకు తనని తనే తిట్టుకొన్నాడు.

లోపల అతడి బర్త్‌ని సులభంగానే గుర్తుపట్టేడు. సూట్‌కేస్ కాళ్ళక్రింద పెట్టి, తీరిగ్గా కూర్చొని కంపార్ట్‌మెంట్‌ని పరిశీలించేడు.

రెండు బెర్త్‌లకి మధ్య అద్దం వుంది. డైనింగ్ ప్లేట్ ఉంది. సీట్లు మెత్తగా ఉన్నాయి. బ్యాక్ రెస్టుకి ఆనుకొంటే హాయిగా ఉంది. డెకోలామ్ ప్లేట్లమీద లైట్లకాంతి అందంగా మెరుస్తోంది. అతని పరిశీలన ఇంకా సాగేదే కానీ అంతలోనే ఆ క్యాబిన్‌లోకి ఇంకో ప్రయాణీకుడు వచ్చేడు.

నల్లటి ప్యాంట్‌మీద తెల్లటి చొక్కా ఇన్‌షర్ట్ చేసుకున్నాడు. బ్లూ టై కట్టుకొన్నాడు. రిమ్‌లెస్ కళ్ళజోడు పెట్టుకున్నాడు. తల కొద్దిగా నెరిసి వుంది. స్మార్ట్‌గా, బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లా ఉన్నాడు.

ఇంతలో బైట కారిడార్‌లో కలకలం వినిపించింది.

పోర్టర్ బెడ్డింగ్ తీసుకొచ్చి పెట్టి వెళ్ళిపోయాడు.

వెనుకే నిలబెట్టిన బెడ్డింగులా ఉన్నాయన వచ్చాడు. అతనితో పాటు పదిమంది.... పూలదండలు ... గొడవ .... నమస్కారాలు .... మాజీ మినిష్టరుగారట.

భానుమూర్తికి ఊపిరాడలేదు. ఎలాగో దారి చేసుకొని బయట కొచ్చేడు. ప్లాట్‌ఫాం రష్‌గా ఉంది. చక్రాల బండిమీద పుస్తకాల వాడొచ్చేడు.

ఏం కొందామా అన్న ఆలోచన ...తెలుగు పుస్తకాలు కూడా ఉన్నాయి.

క్షణం ఆలోచించి ఇలస్ట్రేటెడ్ వీక్లీ కొన్నాడు.

ఇంతలో గార్డు విజిల్ వినబడింది.

పది రూపాయల నోటు తీసి పుస్తకాల వాడికిచ్చాడు. వాడు విసుగ్గా "చిల్లరలేదా?' ' అన్నాడు హిందీలో.

లేదన్నాడు భానుమూర్తి.

వాడు విసుక్కుంటూ నాలుగు అర్థరూపాయి కాసులు, ఆరు పావలాలు, మిగతావి పదిపైసల బిళ్ళలూ కుప్పగా అతడి చేతిలో పోసేడు.

అవో చేత్తోనూ, వీక్లీ ఒక చేతితోనూ పట్టుకొని కదులుతున్న ట్రైన్ ఎక్కేడు భానుమూర్తి.

అతడు తన క్యాబిన్‌లోకి వచ్చేసరికి మూడో ప్రయాణీకుడు కూడా వచ్చేడు. అతడో యువకుడు. వెనుకనుంచి ఆడదాన్లా, ముందునుంచి మధ్యస్తంగా ఉన్నాడు. ఛూయింగ్ గమ్ నవుల్తూ కాలుమీద కాలేసుకుని ఆడిస్తూ ఉన్నాడు. నల్లటి పాయింటెడ్ షూమీద లైట్ల కాంతి మెరుస్తోంది. ఫస్టుక్లాస్ కంపార్టుమెంట్‌లోనే పుట్టినట్లు క్యాజువల్‌గా వున్నాడు.

కిస్స్

భానుమూర్తికి ఒక్కసారిగా భరించలేని నిస్సత్తువ ఆవరించింది. అయిదుగురు ఆఫీసర్ల మధ్యకు వెళ్ళి ఫైల్ అందించవలసిన ఎల్డీసీ పరిస్థితిలా వుంది. మామూలుగా వుండటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

మాజీ మినిష్టర్ గారూ, బిజినెస్ మాగ్నెట్‌లా వున్నాయన బెంగాలీలో ఏదో మాట్లాడుకుంటున్నారు.

చిల్లర చప్పుడవకుండా జేబులో వేసుకున్నాడు.

"సి-త్రీ" అంటే అప్పర్ బెర్త్. ఇప్పుడే వెళ్ళాలో యింకొంచెం సేపు వుండొచ్చో తెలీదు. అయినా "సి-వన్" ఆయన యింకా కూర్చొనే వున్నాడు కదా! అతని ఆలోచనల్ని చెదరగొడుతూ "టుడే యిట్స్ గోయింగ్ ఐ థింక్ ఎ బిట్ స్లో ...." అన్నాడు కుర్రవాడు. తల తిప్పినపుడు అతని చెంపల మీద జుత్తు షోగ్గా కదులుతోంది.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్ తలూపేడు. అతడు మళ్ళీ కిటికీలోంచి బయటకు చూడ్డంలో మునిగిపోయాడు.

మంత్రిగారు హిందీ పేపరూ, బిజినెస్ ఏగ్జిక్యూటివ్ బెంగాలీ మాగ్‌జైన్ చదువుతున్నారు.

భానుమూర్తి యిలస్ట్రేటెడ్ వీక్లీ తీసి హెడ్డింగులు చూస్తూ పేజీలు తిరగెయ్యసాగాడు.

ఇంతలో తలుపు తెరుచుకొని కాకీ బట్టలు వేసుకున్నతను లోపలి కొచ్చేడు.

భానుమూర్తి టికెట్ కోసం జేబులో చెయ్యి పెడుతూంటే, "నైట్ డిన్నర్ సార్...." అన్నాడు.

అక్కడి వరకూ వెళ్ళిన చేతిని కాలిమీద గోక్కోవటం కోసం విని యోగించి తల అడ్డంగా ఊపాడు భానుమూర్తి.

మిగతా ముగ్గిరి దగ్గిరా ఆర్డరు తీసుకొని వాడు వెళ్ళిపోయాడు.

ఇంతలో మాజీ మంత్రిగారు లేచి బైటకు వెళ్ళి వచ్చేరు.

భానుమూర్తి బలంగా ఊపిరి పీల్చుకొని వదిలేడు. నిజానికి అతడు బైటకి వెళ్ళాల్సిన అవసరం ఎప్పట్నుంచో వుంది. కానీ కంపార్టుమెంట్‌లోకి రాగానే, వెంటనే మళ్ళీ బైటకు వెళ్తే మరీ పల్లెటూరి వాడిలా వుంటుందని ఇంతసేపూ ఊరుకున్నాడు.

భానుమూర్తి తిరిగి వచ్చేసరికి ముగ్గురూ డిన్నర్ చేస్తున్నారు.

తలుపు తెరిచిన భానుమూర్తి, వాళ్ళందరూ ఒక్కసారిగా తనకేసి తిరిగే సరికి ఇరకాటంలో పడ్డాడు. బయటకు వెళ్ళిపోదామా అనుకొని, మళ్ళీ అది బాగోదని లోపలికి వచ్చి కూర్చున్నాడు.

కుర్రవాడు ఆమ్లెట్‌ని ఫోర్క్‌తో తింటున్నాడు. మంత్రిగారు బాయిల్డ్ ఎగ్స్‌ని కత్తితో కోస్తున్నారు.

"మీరేం తీసుకోవటం లేదే?" ఇంగ్లీష్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్ అడిగేసరికి తత్తరపడ్డాడు. అప్పటి వరకూ అటే చూస్తూన్న భానుమూర్తి చప్పున దృష్టిమార్చి "నేను ట్రైన్ ఎక్కేముందే తినేశానండీ" అన్నాడు ఇంగ్లీషులోనే.

ఇది జరిగాక యింక అతనికి కూర్చోబుద్ధి కాలేదు. ఏదో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ మనసుని తొలిచేస్తూంది. లేచి బర్త్‌మీదకు వెళ్ళి పడుకున్నాడు.

బ్యాగ్‌లో పంచె వుంది, కానీ కట్టుకోవటం యేం బాగుంటుంది? అసలు కట్టుకోవడం ఎక్కడా? బయటకు తీసికెళ్తే తను వెళ్ళగానే వీళ్ళు నవ్వుకుంటారేమో?

వాళ్ళ డిన్నర్ పూర్తయింది.

అడదాన్లా వున్న కుర్రాడు పూలలుంగీ తీసి అక్కడే కట్టుకున్నాడు.

లైట్లు ఆర్పి, బెడ్‌లైటు వేసేరు.

నీలి సబ్‌ట్యూబ్ లైటింగ్ క్యాబిన్ అంతా పరచుకొని వుంది.

భానుమూర్తికి నిద్ర రావటం లేదు.

కారణం- ఫ్యాను.

చల్లటిగాలి, మొహం మీదకు కొడుతోంది చల్లగా.... సూదులతో గుచ్చుతున్నట్లు....

దానికి తోడు ఆకలి. చికెన్ టిక్కా పేరు మీద తిన్న మూడు ముక్కలూ ఎప్పుడో అరిగిపోయాయి.

అటూ ఇటూ పొర్లుతున్నాడు.

కదిలినప్పుడల్లా యిరుకు ప్యాంటు గర గరలాడి చిరాకును కలిగిస్తూంది.

ఆ ఇబ్బందితోనే అతడికి తెల్లవారు ఝాము నెప్పుడో నిద్రపట్టింది.

........................

రెండు గంటలన్నా అతడు నిద్రపోయాడో లేదో మెలుకువ వచ్చేసింది.

తెల్లవారిపోతూంది. అందరూ లేచే వున్నారు. వైజాగ్ దగ్గిర పడుతోంది. భానుమూర్తి ఆదరాబాదరా లేచి మొహం కడుక్కుని వచ్చేసరికి స్టేషన్‌లో ఆగింది రైలు.

అతడు దిగి టిఫిన్ తిన్నాడు.

అప్పటికి గానీ ఆత్మారాముడు చల్లబడలేదు. నిద్ర లేకపోవటం వలన కళ్ళు మండుతున్నా, రాత్రి నుంచి బాధిస్తూన్న ఆకలి తీరటంవల్ల కొంత ప్రశాంతంగా వుంది.

అతడు తిరిగి తన కంపార్టుమెంట్‌కి వచ్చేసరికి చిన్న గొడవ జరుగుతోంది.

"నా దగ్గిర చిల్లర లేదు" అంటున్నాడు బిజినెస్ ఎగ్జిక్యూటివ్.

కాఫీలవాడు అవతల్నుంచి గోల చేస్తున్నాడు.

"అయిదు రూపాయల చిల్లరుందా?"

"తీసుకొస్తాను సార్."

ఎగ్జిక్యూటివ్, మంత్రిగారి వైపు తిరిగి "చూసేరా తీసుకొస్తాడట. అట్నుంచి అటే వెళ్ళిపోవడానికి ఎత్తు" అన్నాడు ఇంగ్లీషులో.

భానుమూర్తికి తన దగ్గిర కుప్పగా వున్న చిల్లర జ్ఞాపకం వచ్చింది. కానీ దాన్ని బయట పెట్టడానికి సిగ్గేసింది.

కుర్రవాడు టాయిలెట్‌కి వెళ్ళినట్టున్నాడు.

"ముందు చిల్లర తీసుకురా- అయిదు రూపాయల నోటిస్తాను"

"అలా ఇవ్వరు బాబూ"

"మరి నీకు అయిదు యివ్వగానే రైలు కదిల్తే-" తన లాజిక్‌కి తనే నవ్వుకుంటూ మాజీమంత్రి గారన్నారు.

"పరుగెత్తుకొస్తా సార్."

"నమ్మకం ఏమిటోయ్?" అన్నాడు బిజినెస్ ఎగ్జిక్యూటివ్.

"ఈ రైల్వే ప్లాట్‌ఫారం మీద వాళ్ళని నమ్మకూడదు. కొంచెం వీలు చిక్కితే ప్రయాణీకుల్ని మోసం చేస్తారు."

"అవును. ఆ ట్రెండ్ తెలుస్తూందిగా."

ఈలోగా కాఫీవాడు బ్రతిమలాడుతున్నాడు. "ఈ అర్ధ రూపాయి పోతే మళ్ళీ పది గ్లాసు లమ్మితే గానీ నష్టం పూడదు" వాడికి హిందీలో సరిగ్గా ప్రవేశం లేకపోవడంవల్ల తడబడుతున్నాడు.

"నీ అర్థరూపాయి కోసం నా నాలుగున్నరా నష్టపొమ్మంటావా?"

మాజీ మంత్రిగారు నవ్వి "కొంచెం డబ్బున్నవాడిని చూస్తే ప్రతివాడికీ లోకువే-" అన్నాడు.

"చూడండి, ఎంత నీట్‌గా మనని మోసం చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడో, ఏడ్చి చచ్చినా వీడికి యివ్వను."

"వాడికెందుకు అంత పంతం- వెళ్ళి చిల్లర తేవచ్చుగా."

"అలా అయితే అయిదు రూపాయలూ కొట్టేసే వీలుండదుగా-" గార్డు విజిల్ వేసేడు.

కాఫీవాడు కంగారు పడ్తున్నాడు. "బాబ్బాబు - మీకు అయిదు ఒక లెక్కలోది కాదు. కానీ నాకు ఆ అర్థరూపాయి పోతే కష్టం బాబూః ఇచ్చేయ్యండి. ఇదో మూడు రూపాయిలున్నాయి. తీసుకోండి-"

ఏదో విజయం సాధించినట్టూ ఎగ్జిక్యూటివ్ నవ్వేడు. "చూశారా వాడికి ఈ డబ్బు కొట్టెయ్యాలనే ఉంది."

రైలు కూత పెట్టింది.

"ఇలా మోసం చేసే వాళ్ళుండబట్టే దేశం తగలబడి పోతోంది" అన్నారు మంత్రిగారు.

రైలు నెమ్మదిగా కదిలింది.

కిటికీ పట్టుకొని "డబ్బులు బాబూ-" అంటూ వస్తున్నాడు వాడు. తల అడ్డంగా ఊపుతున్నాడు ఎగ్జిక్యూటివ్. అంతలో వాడి కాలు తడబడి నట్టుంది. ప్లాట్ ఫారం మీద బోర్లాపడ్డాడు.

భానుమూర్తి చప్పున కిటికీనుండి చూశాడు.

వాడు మోచేతుల మీద లేస్తూ ఒకే తిట్టు గొంతు పగిలేలా అరిచేడు. "ఒరే లంజాకొడకా...." గాజులాటి అరిస్టోక్రసీ పటాలున పగిలింది.

భానుమూర్తి చువ్వలా లేచేడు.

ఫ్యాంటు జేబులో కర్చీఫ్‌లో ఉండగా చుట్టిన రెండు గుప్పెళ్ళ చిల్లరలోంచి అర్థరూపాయి కాసు తీసి ఊహించని వేగంతో ప్లాట్ ఫారం మీదకు విసిరేడు.

ఆ హడావుడిలో చిల్లర క్యాబిన్‌లో నలుమూలలా పడింది. దాన్ని పట్టించుకోకుండా కాఫీవాడు ఆ అర్ధరూపాయిని తీసుకున్నదీ లేనిదీ చూసి, తీసుకోవటం గమనించి సంతృప్తిపడి వెనుదిరిగాడు.

ఎగ్జిక్యూటివూ, మాజీ మంత్రిగారూ భానుమూర్తివైపు కళ్ళప్పగించి చూడసాగారు.

భానుమూర్తి మోకాళ్ళ మీద వంగి చిల్లర ఏరసాగేడు. పుస్తకాల వాడికీ, కాఫీవాడికీ ఇచ్చిందిపోను, మిగతా డబ్బంతా లెక్క సరిపోయే వరకూ మూల మూలలన్నీ వెతికి, చిల్లర పోగుచేసేడు.

"ప్లీజ్ గివ్ మి యువర్ రుపీస్" అని నాలుగున్నర చిల్లర ఇచ్చేడు.

కడుపునిండా తినటం వల్ల నిద్ర ముంచుకొస్తోంది ఫ్యాంట్ విప్పి, బ్యాగ్‌లోంచి పంచెతీసి కట్టుకున్నాడు. ఆ తరువాత రాడ్ పట్టుకొని పై బర్త్‌మీదకి ఎక్కి, బ్యాగ్ తలక్రింద పెట్టుకుని, ఆ తరువాత రెండు నిముషాలకల్లా నిద్రపోయాడు.

❀ ❀ ❀

**(స్వాతి - 1980)**